క్లుప్తంగా

ఘనంగా పెద్దపట్నం

వేలేరు : మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని గట్టుమల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మల్లన్న పెద్దపట్నం కార్యక్రమాన్ని ఒగ్గు పూజారులు కనులపండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం అనంతరం ఒగ్గు పూజారుల సమక్షంలో ప్రారంభమైన పెద్దపట్నం.. తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఆలయ అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పెద్దపట్నం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు పట్నం దాటిన తర్వాత భక్తులు మల్లన్నను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వినయ్‌శర్మ, మహేష్, ఒగ్గు పూజారులు అమరగొండ సాంబరాజు, మల్లేష్, రాజ్‌కుమార్, గణేశ్, మహేష్ పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కమలాపూర్ : పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన హరికృష్ణను కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. టీపీసీసీ కోఆర్డినేటర్ తౌటం రవీందర్, హుజూరాబాద్ బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దేశిని ఐలయ్యగౌడ్, నాయకులు కొండ రమేష్, దేవేందర్ పాల్గొన్నారు.

కమిటీలో వేలేరుకు ప్రాధాన్యం ఇవ్వాలి



వేలేరు : మండలంలోని గట్టుమల్లికార్జునస్వామి ఆలయ కమిటీలో వేలేరు గ్రామానికి ప్రాధాన్యం ఇవ్వాలని యాదవ సంఘం నాయకుడు బంక శ్రీనివాస్‌యాదవ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతీసారి వేలేరుకు డైరెక్టర్ పదవి ఇచ్చేవారని, కానీ ప్రస్తుతం ఒకే గ్రామానికి రెండేసి డైరెక్టర్ పదవులు ఇచ్చి వేలేరుకు ఒకటి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. రానున్న శాశ్వత కమిటీలో యాదవులకే చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాదవ సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఆత్మకూరు : విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని స్పెక్ట్రా హైస్కూల్ డైరెక్టర్లు జ్ఞానేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్పెక్ట్రా హైస్కూల్‌లో శనివారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు



శాయంపేట : మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, సిరికొండ యువసేన సభ్యులు శనివారం మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని శనివారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో జరుగుతున్న రాజకీయ సమీకరణలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యువజన నాయకులు బేరుగు రాకేష్, మాస్కుల రాజు, శ్రీనివాస్, ప్రదీప్ ఉన్నారు.

13న వేలంపాట

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 7 షెటర్లు, కూరగాయల మార్కెట్‌కు ఈనెల 13న వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సుభాషిణి, ఎంపీఓ రంజిత్‌కుమార్ శనివారం తెలిపారు. 2024–25 సంవత్సరానికిగాను షాపింగ్ కాంప్లెక్స్, కూరగాయల మార్కెట్ వేలంపాటను ఉదయం 9గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు షాపింగ్ కాంప్లెక్స్ డిపాజిట్ రూ. 10వేలు, తైబజార్ డిపాజిట్ రూ. 30వేలు ఈనెల 12న సాయంత్రం 5గంటలలోపు చెల్లించాలని తెలిపారు. వేలంపాటలో టెండర్ దక్కించుకున్న వారు అదేరోజు 50శాతం డబ్బులు గ్రామపంచాయతీకి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్సై, ఎంఈఓ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రహసీత్

కమలాపూర్ : త్వరలో జరుగనున్న పదోతరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ ఇ.రాంకిషన్‌రాజు, ఎస్సై వీరభద్రరావు సూచించారు. మండల కేంద్రంలోని విశ్వభారతి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యానికి అనుగుణంగా కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లితండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాళ్లను, సిబ్బందిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు ముఖ్య అతిథులు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మధుబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు రాయాలి

పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రహసీత్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో చదువుతూ పదోతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పీఎం శ్రీపథకంలో భాగంగా కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దన్నారు. పాజిటివ్ దృక్పథంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఎన్ని గంటలు చదివామన్నది ముఖ్యం కాదని, ఎంత వరకు విషయాన్ని గ్రహించామనేది ముఖ్యమని అన్నారు. వేకువజామునే చదువుకోవడం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉండి చదివింది జ్ఞాపకం ఉంటుందని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్స్ ఓదెల మల్లయ్య, జి.ప్రఫుల్లాదేవి, వైద్యాధికారి నాగరాజు, ఏటీపీలు రవి, నిహారిక, డిప్యూటీ వార్డెన్ రమేష్, ఉపాధ్యాయులు రజిత, విజయ్‌కుమార్, సాధన, కవిత, ఆయేషా, వైద్య సిబ్బంది రవీందర్, విప్లవ్‌కుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే పదవులకు రాజీనామా చేయాలి

- మార్నేని దంపతులపై బీఆర్ఎస్ ఫైర్



మాట్లాడుతున్న నాయకులు

ఐనవోలు : బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి ముందుగా పదవులకు రాజీనామా చేసి పార్టీ నుంచి వెళ్లిపోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీలో రాజకీయ నిరుద్యోగిగా ఉండి అస్తిత్వాన్ని కోల్పోయే స్థితిలో మార్నేని రవీందర్‌రావు ఉండగా బీఆర్ఎస్ పార్టీ, అరూరి రమేష్ ఆదరించి గుర్తింపునిచ్చిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. డీసీసీబీ పీఠం కట్టబెట్టి, ఆయన సతీమణిని ఎంపీపీ చేసిన బీఆర్ఎస్ పార్టీని వీడటం సరికాదన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో అరూరికి వ్యతిరేకంగా ప్రచారం చేసి పార్టీకి తీవ్ర నష్టం చేశారని ఆరోపించారు. నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు సృష్టించి నాయకులు, కార్యకర్తల మధ్య గొడవలు సృష్టించారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాగా మార్నేని దంపతులు బీఆర్ఎస్ పార్టీని వీడడంతో స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ బాబు, నాయకులు జైపాల్, లక్ష్మణ్, రాజు, రాజు, గుంశావలి, కోమలత, కుమార్, సంపత్, శ్రవణ్, శేఖర్, ప్రభాకర్, అరుణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం

కమలాపూర్ : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.రాజమల్లయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ మహిళా ఉపాధ్యాయులతో మాట్లాడారు. కుటుంబ బాధ్యతలతో సతమతమవుతున్న మహిళలపై వృత్తి బాధ్యతలు అదనంగా పడుతున్నాయని, అయినప్పటికీ చాలా మంది మహిళలు ఆ బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. మహిళలు హక్కుల సాధన కోసం పోరాడేందుకు ఐక్యమత్యంగా ఉండాలన్నారు. అనంతరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజనిదేవి, సువర్ణ, ఉషారమణి, ఉషారాణి, ఏమతి, వాణిశ్రీ, మమత, పద్మ, మాధురి, ప్రభావతి, అన్నమ్మ, జయ, మాధవి, లత, స్వరూపరాణి పాల్గొన్నారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సత్యపాల్‌రెడ్డి

శాయంపేట : ఈనెల 12వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. అమిత్ షా సభకు పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ టికెట్ 'దొమ్మాటి' కే ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రీధర్

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ దొమ్మాటి సాంబయ్యకు కేటాయించాలని పరకాల యూత్‌కాంగ్రెస్ అసెంబ్లీ కన్వీనర్ మాదాసి శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా పనిచేసిన దొమ్మాటి సాంబయ్యకు ఎంపీ టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. నియోజకవర్గ యూత్ కార్యదర్శి వినోద్, అక్కంపేట యూత్ అధ్యక్షుడు రాజు, అనిల్‌కుమార్, వార్డుసభ్యులు ప్రసంగి, యూత్ నాయకులు ప్రవీణ్, రవి, స్వామి, మొండయ్య, సారయ్య, ఎలీషా, సదానందం, మల్లేష్, రవి, ప్రభాకర్, మహేందర్ పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులు పూర్తిచేయండి



నయీంనగర్: నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ నయీంనగర్ నాలా విస్తరణ, సైడ్ వాల్స్ ఏర్పాటు, పెద్దమోరీ బ్రిడ్జి విస్తరణ, పైపులైన్ ఏర్పాటు పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశించారు. పెద్ద మోరీ నాలా పనులను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. డీఈలు, ఏఈలు, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, రాహుల్‌రెడ్డి, ప్రదీప్, సుమన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రైల్వే సంఘ నాయకులు

కాజీపేట రూరల్: హనుమకొండ ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కాజీపేట సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బొకే అందజేసి సన్మానించారు. అనంతరం రైల్వే ఎంప్లాయీస్ సంఘ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ జి.ప్రభురాజ్, అడిషనల్ డివిజనల్ సెక్రటరీ కె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మహ్మద్ అంకూస్, రైల్వే సంఘ సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరె కులస్తుల అభివృద్ధికి సహకరిస్తా..

హన్మకొండ చౌరస్తా: ఆరె కులస్తుల జీవన స్థితిగతులపై తనకు పూర్తి అవగాహన ఉందని, వారి సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజాభవన్‌లో హనుమకొండ జిల్లా ఆరె సంక్షేమ జిల్లా బాధ్యులు ఎమ్మెల్యేను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శివాజీ, కిషన్, కండేరావు, లింగమూర్తి, బాబురావు, రాజేశ్వర్, దీపక్, నిరంజన్, భాస్కర్, శ్రీనివాస్, శ్యామ్, రాజు, అంజాజీ పాల్గొన్నారు.

కేంద్ర పాసిస్ట్ విధానాలపై పోరాడుదాం



మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

హసన్‌పర్తి: కేంద్ర ప్రభుత్వ పాసిస్ట్ విధానాలపై ప్రతిఒక్కరూ పోరాడాలని తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి సూచించారు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మెజారిటీ వాదం పేరుతో మైనారిటీలు, వామపక్ష వాదులు, దళితులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మణిపూర్, అస్సాం రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, వేధింపులను అరికట్టడంతో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళల ప్రాధాన్యత విషయంలో మిగతా ప్రజాస్వామ్య దేశాలతో పోల్చితే భారతదేశం వెనుకబడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, రాజమౌళి, దోమ రాకేష్, ఎర్ర కుమారస్వామి, శ్యాంసుందర్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, దోమ జ్యోతి, దాసు, సరోజన, మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ ఆధ్వర్యంలో..

దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం మడిపల్లిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నేటి సమావేశాలు

సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్ష

మడికొండ: సైనిక్ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మడికొండ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు.

విద్యుత్‌కు అంతరాయం

హసన్‌పర్తి: చింతగట్టు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ గంగారెడ్డి తెలిపారు. కేసీక్యాంప్, రామారం, భీమారం, కోమటిపల్లి, భద్రకాళినగర్, చింతగట్టు, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కళాశాల ఏరియా, హసన్‌పర్తి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు మెపా సమావేశం

హన్మకొండ: ఈనెల 10న ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) తెలంగాణ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ తెలిపారు. హైదరాబాద్ కోటి సమీపంలోని బీసీ భవన్‌లో ఆదివారం ఉదయం జరగనున్న సమావేశంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ప్రతినిధులు పాల్గొంటారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మెపా నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోనున్నట్లు వివరించారు.

ఉచిత వైద్య శిబిరం

హసన్‌పర్తి: భీమారంలోని శ్రీమౌర్య ఆస్పత్రి ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. డాక్టర్ మధుకర్, డాక్టర్ హిమబిందుతో పాటు పలువురు వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు.

13, 14వ తేదీల్లో ఎస్సారెస్పీ నీరు విడుదల

సాక్షి స్పందన

నడికూడ : సాగునీరు లేక వరిపొలాలు ఎండుతుండగా శనివారం సాక్షిలో ప్రచురితమైన 'ఎండుతున్న వరిపొలాలు' అనే కథనానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పందించారు. ఎస్సారెస్పీ సీఈ(ఇరిగేషన్), వరంగల్ ఓ.వి. రమేష్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల సమస్యలను వివరించి సాధ్యమంత త్వరగా నీటిని విడుదల చేయాలని కోరారు. 13వ తేదీ లేదా 14వ తేదీన ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కంటి శస్త్ర చికిత్సలు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని డాక్టర్ విశ్వనాథరావు ఆస్పత్రి ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 14 మందికి శనివారం ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. పలువురికి కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ సుస్మిత ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ సభ్యులను సన్మానించారు.

వైభవంగా మల్లికార్జునుడి శోభాయాత్ర



రావణ వాహనసేవపై మల్లికార్జునుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఐనవోలు : ప్రఖ్యాత మల్లికార్జునస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వాహన సేవ, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. నిత్య పూజలతో పాటు ఉదయం రావణ వాహనంపై ఉత్సవ మూర్తులకు శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, పురవీధిసేవ, రథాంగ హోమం, తదితర కార్యక్రమాలను పండితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉపప్రధాన అర్చకుడు రవీందర్, ముఖ్య అర్చకుడు శ్రీనివాస్, మధుకర్‌శర్మ, పండితులు పురుషోత్తమశర్మ, విక్రాంత్‌వినాయక్‌జోషి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు త్వరగా పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల్లో గిరిజన సంక్షేమశాఖ నిధులతో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. గతేడాది గిరిజన సంక్షేమశాఖ నుంచి తండాల్లో రోడ్ల అభివృద్ధి కోసం మండలానికి రూ.12 కోట్లు మంజూరు చేయగా పనులు ఆలస్యం అవుతుండటంతో సంబంధిత అధికారుతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్లను పిలిచి అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేసేవిధంగా అధికారులు చొరవ తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, ఈఈ హేమలత, పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించం : రేవూరి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

పరకాల : పదవులను అడ్డుపెట్టుకొని ప్రజలను ఇబ్బంది పెడితే ఏ స్థాయి నాయకులనైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి పరకాల నియోజకవర్గంలో 20 వేల ఓట్ల మెజారిటీ వచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పరకాల పట్టణ, పరకాల, నడికూడ, ఆత్మకూరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పెరిగిన ఆదరణ చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, కౌన్సిలర్ జయమ్మ, పరకాల మండల, పట్టణ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజు



ఆత్మకూరు : బీజేపీ మండల అధ్యక్షుడిగా నీరుకుళ్లకు చెందిన బలవంతుల రాజును నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శనివారం ప్రకటనలో తెలిపారు. మండలస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. తనకు అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ కాశీప్రసాద్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశానుసారం నడుచుకుంటానని పేర్కొన్నారు.

మహిళలు ప్రశ్నించే స్థాయికి ఎదగాలి



పండ్లు పంపిణీ చేస్తున్న అనితారెడ్డి

హన్మకొండ: మహిళలు తమ ఆలోచనలను ఆచరణలో పెట్టి ప్రశ్నించే స్థాయికి ఎదగాలని ప్రముఖ సామాజికవేత్త, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కరుకాల అనితారెడ్డి సూచించారు. హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని స్వధార్ ఆశ్రమంలో నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్, అనురాగ్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శనివారం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వధార్ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను స్వధార్ ఆశ్రమ నిర్వాహకులు సన్మానించారు. అనంతరం ఆశ్రమంలో వసతి పొందుతున్న మహిళలకు అనితారెడ్డి పండ్లు, బ్రెడ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. స్వధార్ ఆశ్రమ నిర్వాహకురాలు శైలజ, అరుణజ్యోతి పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయం హుండీల లెక్కింపు



కాశిబుగ్గ: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు సమర్పించిన కానుకల హుండీలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం లెక్కించారు. రూ.3,30,070 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, డాక్టర్ గోనె జగదీశ్వర్, మండల శ్రీరాములు, ఓరుగంటి కొమురయ్య, మామిడి ఈశ్వరయ్య, బోడకుంట్ల వైకుంఠం, రమేష్, జోగయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.